ఇంకా తగ్గని వరద ఉధృతి

దెబ్బతిన్న రోడ్లు, పంట పొలాలకు భారీగా గండ్లు

తాడికొండ: కొండవీటి వాగుకు వరద ఉధృతి ఇంకా తగ్గకపోవడంతో పంట పొలాలు నీటిలోనే నానుతున్నాయి. ఇప్పుడిప్పుడే అక్కడక్కడా వరద నుంచి బయటపడుతున్న పంట పొలాల్లో భారీగా గండ్లు పడటంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షలు పోసి పెంచుకున్న పంట పొలాలు ఒక్క వర్షానికి తుడిచిపెట్టుకుపోవడంతో తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. వాగు ఉధృతికి నీరుకొండ, పెదపరిమి, తాడికొండ మండలంలోని పలు గ్రామాల్లో వేలాది ఎకరాల్లో వరద నీరు ఉండటంతో రైతులకు ఆవేదన తప్పడం లేదు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం కారణంగానే తమకీ పరిస్థితి వచ్చిందని పలువురు వాపోతున్నారు. రోడ్లు దెబ్బతినడంతో పాటు వరద నీరు తగ్గకపోవడంతో ఇంకా పలు గ్రామాలకు రాకపోకలు పునరుద్ధరించలేదు. తాడికొండ-కంతేరు, పెదపరిమి-నీరుకొండ, పెదపరిమి-నెక్కల్లు తుళ్ళూరు మండలంలోని లంక గ్రామాలకు రహదారి సౌకర్యం లేక ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. కంతేరు ఆర్‌యూబీలో వరద నీరు తగ్గకపోవడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి చుట్టూ తిరిగిరావాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు మండిపడుతున్నారు.



నీరుకొండ-పెదపరిమి మధ్య నీట మునిగిన పత్తి పంట



చెన్నకేశవ నగర్‌లో ఇళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్

నీట మునిగిన ప్రాంతాల పరిశీలన

దుగ్గిరాల: వర్షాల కారణంగా శిథిలావస్థలో ఉన్న ఇళ్ల గోడలు, పాత భవనాలు కూలిపోయే ప్రమాదం ఉన్నదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు ఐ.సునీత అన్నారు. గురువారం దుగ్గిరాలలోని చెన్నకేశవ నగర్‌లో ఆమె పర్యటించి నీట మునిగిన ఇళ్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నిల్వ ఉన్న నీరు బయటకు పోవడానికి పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు జారీ చేశామన్నారు. పెదకొండూరు, వీర్లపాలెం, గొడవర్రు గ్రామస్తులు కృష్ణా నది ప్రవాహం అధికంగా ఉన్నందున ఎవరూ పశువులను మేపుటకు, చేపల వేటకు వెళ్లరాదని కోరారు. లోతట్టు గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని, దుగ్గిరాలలో కంట్రోల్ రూం(నం.85005 13573) ఏర్పాటు చేశామని ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శి వివేకానంద్ తదితరులు పాల్గొన్నారు.



తాడికొండ-నీరుకొండ మధ్య పూర్తిగా నీట మునిగిన పంటలు

క్లుప్తంగా

ప్రతి ఒక్కరు జాతీయతను చాటుకోవాలి

కమిషనర్ అలీమ్‌బాషా



మంగళగిరి టౌన్ : ప్రతి ఒక్కరు తమ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జాతీయతను చాటుకోవాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్‌బాషా పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయం వద్ద హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యాలయం నుంచి గౌతమబుద్ధ రోడ్, గాలి గోపురం మెయిన్ బజారు మీదుగా కళాశాల విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అలీమ్‌బాషా మాట్లాడుతూ ప్రజల్లో జాతీయతపై అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకై ముందస్తు చర్యలు

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మంగళగిరి టౌన్ : అమరావతి డివిజన్ పరిధిలో వర్షాల కారణంగా విద్యుత ప్రమాదాలు, నష్టాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎపిసిపిడిసిఎల్ అమరావతి డివిజన్ ఏఈ జంగం సంజీవరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14వ తేదీ నుంచి 16 వరకు 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. విద్యుత్ సరఫరా స్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి నివేదికలు స్వీకరించేందుకు జూనియర్ ఇంజనీర్లు, కంప్యూటర్ ఆపరేటర్లను క్రమ పద్ధతిలో విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎటువంటి విద్యుత్ సమస్యలు తలెత్తినా వెంటనే కంట్రోల్ రూమ్ 6281703602, 08645293733 నంబర్లకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఈమనిలో నీట మునిగిన పంట పొలాలు పరిశీలన



దుగ్గిరాల: పొలంలోని నీరు బయటకు వెళ్లిన తరువాత, మొక్కలు బలంగా పెరగడానికి పోషకాల మోతాదు పెంచి, తద్వారా చీడపీడల నుంచి పంటను కాపాడుకోవచ్చునని ఏవో ఆర్.విజయబాబు తెలిపారు. మండలంలోని ఈమని గ్రామంలో గురువారం పంట పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి కురిసిన వర్షాలకు 20-30 రోజుల దశలో ఉన్న వరి పంటలో నీరు బయటకు వెళ్లిన తరువాత పంటకు 130-4 (మల్టీ కె) మందు లీటరు నీటికి 5 గ్రా. చొప్పున కలిపి పిచికారీ చేయాలని అన్నారు. అరటి, దుంపలకు కాపర్ ఆక్సీక్లోరైడ్, పసుపుకి ఆకుమచ్చ తెగులు వ్యాపించకుండా ప్రొపికోనజోల్ వాడాలని సూచించారు. మండలంలో 15,288 ఎకరాల్లో పంట నీట మునిగిందని, అరటి, పసుపు, కంద, నిమ్మ పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని తెలిపారు. రైతులు వారి సమస్యలను తెలియజేశారు. ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, దుగ్గిరాల పసుపు యార్డు చైర్మన్ వి.ఝాన్సీరాణి, కె.శ్రీ అనిత, రైతులు తదితరులు ఉన్నారు.

డీఐజీ కోయ ప్రవీణ్ తీరు దారుణం

వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ

తాడేపల్లిరూరల్ : పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో డీఐజీ స్థాయి అధికారిగా ఉన్న ప్రవీణ్ వ్యవహరించిన తీరు చాలా దారుణమని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.వెంకటరమణ గురువారం తాడేపల్లిలోని ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన అధికారి ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. కడప పార్లమెంట్ సభ్యుడిని ఉదయం నుంచి నిర్బంధించి కూటమి ప్రభుత్వంలోని మంత్రిని మాత్రం పోలీస్ బందోబస్తు మధ్య సెగ్మెంట్‌లో తిరిగేందుకు అనుమతులు ఎలా ఇచ్చారంటూ ప్రశ్నించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే అన్నదాతలకు కడుపుకోత



లాం వద్ద కొండవీటి వాగు ఉధృతిని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాల వజ్రబాబు

వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు

తాడికొండ: ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే అన్నదాతలకు కడుపుకోత మిగిలిందని, ముందస్తు జాగ్రత్తలు పాటించకుండా, కొండవీటి వాగు వరద మళ్లింపునకు చర్యలు తీసుకోకుండా తీసుకున్న నిర్ణయాలే నేడు శాపంగా మారాయని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు అన్నారు. గురువారం తాడికొండ మండలం లాం వద్ద కొండవీటి వాగుపై ఉన్న లో లెవల్ చప్టా, తాడికొండ- నీరుకొండ-నిడమర్రు గ్రామాల మధ్య పూర్తిగా మునిగిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ట్రాక్టరుపై పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లి పంటలు పరిశీలించి రైతులతో ఆయన మాట్లాడారు. ఏటా ఇదే పరిస్థితితో తీవ్ర నష్టాలు వస్తున్నాయని, కొండవీటి వాగును ప్రక్షాళన చేయకుండా రాజధాని పేరుతో రూ.వేల కోట్లు కుమ్మరించడం ప్రభుత్వానికి ఎంతవరకు సమంజసం అని రైతులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా బాల వజ్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ముందుచూపు లేకుండా అభివృద్ధి పేరుతో ఎడాపెడా వెళుతున్న కారణంగానే నేడు చంద్రబాబు గొప్పగా చెప్పుకుంటున్న రాజధానికి ముంపు ముంచుకొచ్చిందని, ముంపు నివారణకు సరైన చర్యలు తీసుకోకుండా రాజధాని నిర్మించడం వలన ప్రయోజనం ఉండకపోను తీవ్ర నష్టం ఉంటుందన్నారు. రూ.234 కోట్లతో పంప్‌హౌస్ ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేశారు కానీ, దిగువకు వరద నీరు వెళ్లే మార్గాలు ప్రక్షాళన చేయలేదన్నారు. రాజధానిలో ఉద్యోగులు సైతం అడుగు పెట్టలేక కార్యాలయాలు మూసే పరిస్థితి వచ్చిందంటే ప్రభుత్వ అనాలోచిత నిర్ణయానికి నిదర్శనమన్నారు. తాము రాజధాని, అక్కడ కడుతున్న నిర్మాణాలకు వ్యతిరేకం కాదని, ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు ఈ ప్రాంత వాసులకు శాపంగా మారుతున్నాయన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి కట్టలను బలోపేతం చేయడంతో పాటు పంటలు మునిగి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట తాడికొండ మండల అధ్యక్షుడు ముప్పాళ్ళ మనోహర్, లాం, తాడికొండ గ్రామ అధ్యక్షులు షేక్ సలీమ్, వంగా పోలారెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు దాసరి రాజు, దానం వినోద్, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షులు మల్లంపాటి రాఘవరెడ్డి, బీసీ, మైనార్టీ, యువజన విభాగాల మండలాధ్యక్షులు దమ్మాటి మోహనరావు, షేక్ బాబావలి, షేక్ అజీస్, పులి రమేష్, ఇనుకపల్లి రమేష్, నాగార్జున రెడ్డి, కొండా కిషోర్ రెడ్డి, రావూరి నరేష్, హుస్సేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థను పటిష్ట పరచాలి

సీపీఎం నాయకులు

తాడేపల్లిరూరల్: ప్రకృతి వైపరీత్యాలు సంభవించి, అకాల వర్షాలు కురిసినప్పుడు పంట పొలాలు ముంపుకు గురికాకుండా డ్రైనేజీ వ్యవస్థను పటిష్ట పరచాలని సీపీఎం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ముంపుకు గురైన పంట పొలాలను గురువారం సీపీఎం నాయకులతో కలసి చిర్రావూరు గ్రామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ డ్రైనేజీ బోర్డు వారి నిర్లక్ష్యం కారణంగా పంట పొలాలు ముంపుకు గురవుతున్నాయని అన్నారు. పొలాలు పక్కన తీసిన డ్రైనేజీ కాలువ పూడుకుపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. డ్రైనేజీలు పొంగి పంట పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు నష్టపోతున్నారని, తక్షణమే డ్రైనేజీ బోర్డు అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ పంట కాలువ సరిగ్గా పూడిక తీయకపోవడంతో మురుగునీరు వర్షాలు కురిసినప్పుడు పంట పొలాల్లోకి ప్రవహిస్తోందని అన్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ, చిర్రావూరు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంట పొలాల పరిశీలించిన సీపీఐ నాయకులు

రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా నీట మునిగిన పంట పొలాలను సీపీఐ నాయకులు, రైతు సంఘం నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చినకాకాని, కాజా పొలిమేర మధ్య గుంటూరు చానల్‌లో గండిపడిన కారణంగా సమీపంలోని పంట పొలాలు నీట మునిగిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే మూడుసార్లు నీటిలో పంట పొలాలు మునగడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. చినకాకాని, కాజా పొలిమేర మధ్య గండిని తక్షణమే పూడ్చి నీటి ప్రవాహాన్ని నియంత్రించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు తక్షణం ఆర్థిక సహాయం, విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, సీపీఐ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చైతన్య తపోవన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట చైతన్య తపోవన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించనున్నట్లు శ్రీమాతా శివానంద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని ఉదయం 7 గంటలకు బాలభోగం, 9 గంటలకు చిన్నారులచే గోపీ కృష్ణ వేషధారణ, 10 గంటలకు రాధాకృష్ణులకు పంచామృతాభిషేకం, 108 పద్మ పుష్పాలతో అర్చన, మధ్యాహ్నం 12 గంటలకు మహానివేదన, మంగళహారతి, 3 గంటలకు మధురాధిపతికి 108 నామాలతో, 108 మధుర పదార్థాలతో మాధుర్యార్చన, సాయంత్రం 4 గంటలకు బాలకృష్ణ లీల-ఉట్టికొట్టుట, 5 గంటలకు 160 మంది గోపకుమారీలచే నృత్యార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నామని, భక్తులు వేడుకల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని పేర్కొన్నారు.

కార్మికుల సమస్యను పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు కె.స్టీవెన్, వై.సాంబయ్యలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నా కార్మికులు దీక్షలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వర్గం పట్ల మొండిగా వ్యవహరించడం సరికాదని, కార్మికుల న్యాయమైన సమస్య పరిష్కారానికి మంత్రి నారా లోకేష్ చొరవ చూపించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో కార్మికులు సుబ్బారావు, పిచ్చయ్య, నాగేశ్వరరావు, రమాదేవి, ఇంమాంబి, శారమ్మ, మల్లేశ్వరి, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు తరలిరండి

మంగళగిరి టౌన్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం బైపాస్‌రోడ్‌లో ఉన్న మంగళగిరి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని నియోజకవర్గ పార్టీ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో విడుదల చేసింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావులు పాల్గొననున్నారని, నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు మాంసాహార విక్రయాలు నిషేధం

కమిషనర్ అలీమ్‌బాషా

మంగళగిరి టౌన్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో నేడు మాంసాహార విక్రయాలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు కమిషనర్ అలీమ్‌బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మాంసం, చేపల దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లతో సహా అన్ని వాణిజ్య సంస్థల్లో మాంసాహార విక్రయాలు చేయరాదని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

విఘ్నేశ్వర ఆలయానికి తాళాలు



తాడేపల్లిరూరల్ : యర్రబాలెం లోని చెరువు గట్టు మీద వున్న విఘ్నేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు కొంతమంది, అక్కడ వున్న భక్తులు గురువారం విఘ్నేశ్వర ఆలయానికి తాళాలు వేయడం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత సంవత్సర కాలం నుండి యర్రబాలెంలోని చెరువు విఘ్నేశ్వరస్వామి దేవాలయానికి గ్రామానికి చెందిన కొంతమంది స్వార్థ రాజకీయ నాయకులు కమిటీ సభ్యుల్లోని ఒకరు ఇద్దరిని అడ్డం పెట్టుకుని గుడి ప్రధాన ద్వారం వద్ద వున్న గేటుకు తాళం వేశారని అన్నారు. . గత సంవత్సరం వినాయక చవితికి ముందు ఇలాగే గేటుకు తాళం వేయడంతో గ్రామస్తులు గొడవ చేయడంతో వినాయక చవితిని కమిటీ సభ్యులు, అక్కడ వున్న విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంవత్సరం ఈ దేవాలయంలో వినాయకచవితి నిర్వహించకూడదని యర్రబాలెంలో ఓ పేరున్న రాజకీయ నాయకుడు కొంతమంది కమిటీ సభ్యులను రెచ్చగొట్టి తాళాలు వేయించారని, గుడి తాళాలు వెంటనే తెరవకపోతే ధర్నా చేస్తామని భక్తులు హెచ్చరించారు.